# పాలకుల విధ్వంస విధానాలపై చర్చిద్దాం రండి..

- ప్రముఖ వైద్యులు డా.వై.రవీంద్రనాథ్ పిలుపు
- ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రం వేదికగా..
- నేడే ప్రజాచైతన్య సదస్సు..
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న బహుముఖ ప్రజ్ఞాశాలి పరకాల ప్రభాకర్
- ప్రత్యామ్యాయ పౌర సమూహం ఆధ్వర్యంలో సదస్సు

**'రండి.. రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ, దేశంలో విధ్వంస రచనకు పూనుకున్న పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై చర్చిద్దాం రండి.. నేడు సాయంత్రం ఖమ్మం లోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే ప్రజాచైతన్య సదస్సును జయప్రదం చేద్దాం.. మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. డా. బి.ఆర్. అంబేద్కర్ నాయకత్వంలో రూపొందిన రాజ్యాంగం లౌకిక విధానం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆర్థిక-సామాజిక సమానత్వం, సమాఖ్య విధానం వంటి అంశాలతో దేశాన్ని ముందుకు నడపాల్సి ఉంటుందని.. కులం, మతం తదితరు సాంస్కృతిక, సామాజిక సున్నిత అంశాలను రాజకీయాలకు జోడించి మనలో మనకు విద్వేషాలను రగిలిస్తున్నాయి. భావోద్వేగ రాజకీయాల చుట్టూ మనల్ని తిప్పుతూ, మరోవైపు మన శారీరక, మానసిక శ్రమల ద్వారా సృష్టించబడుతున్న దేశ సంపదను కార్పొరేట్స్ చేతుల్లో పెడుతున్నాయి. ఇటువంటి ప్రమాదకర పరిస్థితుల నుండి దేశాన్ని, దేశాన్ని ముందుకు నడిపించాల్సిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి. పౌర సమాజంలోని ప్రతి ఒక్కరమూ ఇది మన బాధ్యతగా భావించాలి.. అందుకే చైతన్య వంతమైన ఖమ్మం వేదికగా ప్రత్యామ్నాయ పౌర సమూహం(సీసీఏ)ను నిర్వహిస్తున్నామని' ప్రముఖ వైద్యులు, సీసీఏ ఖమ్మం జిల్లా బాధ్యులు డా.యలమంచిలి రవీంద్రనాథ్ తెలిపారు. నేడు ఖమ్మంలో జరుగనున్న ప్రజాచైతన్య సదస్సుకు సంబంధించి సీసీఏ బాధ్యులుగా డా.రవీంద్రనాథ్ కెరటం న్యూస్‌కు ప్రత్యేకంగా ఇంటర్వూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..**

**ఖమ్మ బ్యూరో, కెరటం న్యూస్**

**రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకే సీసీఏ**

ప్రస్తుతం భారతదేశంలో అనేక ఏండ్లుగా ప్రమాదపు అంచుల్లో లౌకిక విధానం కొట్టుమిట్టాడుతోందనీ, ఇటీవల ఇది మరింత తీవ్రం అయిందని డా.రవీంద్రనాథ్ అన్నారు. అత్యంత విశాలమైన, విభిన్నమైన భారతదేశ సమగ్రత, ప్రజాస్వామిక భద్రత లౌకికవాదంపైన ఆధారపడి ఉంటుంది. రాజ్యాంగం దేశాన్ని లౌకిక రాజ్యంగా పేర్కొంది. అయితే దేశంలో మెజారిటీ మైనారిటీ వాదాల పేరిట వైషమ్యాలను సృష్టించి, హిందుత్వ రాజ్యంగా దేశాన్ని మార్చాలని చూస్తున్నాయని అన్నారు. పాఠ్య పుస్తకాలలోని సిలబస్ను మతం ప్రాతిపదికన రూపొందిస్తున్నాయి. మైనారిటీ రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటనలు చేస్తున్నాయి. విశ్వ విద్యాలయాలను నిర్వీర్యం చేస్తూ, వాటిని వారి ఉన్మాద భావజాల ఉత్పత్తి కేంద్రాలుగా మారుస్తున్నారు. సిఎఎ, ఎన్నార్సీ వంటి చట్టాల ద్వారా మనల్ని మతం పేరిట విభజించే ప్రణాళికలు రచిస్తున్నారు. మన పండుగలు, ఉత్సవాలు, జాతర్లకు మతం రంగు పులిమి మన మధ్య ఉన్న సామరస్యాన్ని దెబ్బతీయాలని ప్రయత్నం చేస్తున్నారని డా.రవీంద్రనాథ్ వెల్లడించారు.

**భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్ళు:-**



రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (ఎ) దేశంలోని ప్రతి పౌరుడికీ భావ ప్రకటనా స్వేచ్ఛను అందిస్తోంది. అయితే ప్రస్తుతం దేశంలో ఈ స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తున్నారు. ముఖ్యంగా బిజెపి ప్రభుత్వం నిరంకుశ, ఫాసిస్టు తరహా పోకడల ద్వారా ఈ స్వేచ్ఛను హరిస్తోంది. దేశంలో జరుగుతున్న పరిణామాల మీద ప్రశ్నించిన వ్యక్తులను, సంస్థలను, ప్రతిపక్ష రాజకీయ పార్టీలను అణచివేసే ప్రయత్నం చేస్తుంది. భిన్న భావజాలాలకు, ఆలోచనలకు ప్రతినిధులుగా ఉన్న గోవింద్ పన్సారే, కల్బుర్గి, గౌరీలంకేష్, దబోల్కర్ లాంటి వారిని దారుణంగా హత్యలు చేసినా, ప్రభుత్వం పట్టించుకునే స్థితిలో లేదు. సామాజిక, సాంస్కృతిక కార్యకర్తలు, మేధావులు భిన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తుంటే, బిజెపి వారిని జైళ్ళలో నిర్బందిస్తోంది. సుధా భరద్వాజ్, అరుణ్ ఫెరీరా, ఆనంద్ తేలుంబ్లే, గౌతమ్ నవ్లఖా వంటి ప్రజాస్వామిక నేతలను ఏళ్ళ తరబడి జైళ్ళలో నిర్బంధిస్తున్నారు. ప్రముఖ ఆదివాసీ హక్కుల నాయకుడు స్టాన్ స్వామి జైలులోనే మరణించాడు. ఇటీవల ఉత్తరప్రదేశ్లో జరిగిన అనేక ఘటనలు ఇందుకు తిరుగులేని సాక్ష్యాలు.

**చరిత్ర వక్రీకరణ - సాంస్కృతిక ఆధిపత్యం:-**

పాలకులు నిరంతరం చరిత్రను వక్రీకరించే పనిలో ఉంటున్నారు. అందు కోసం అవి దేశంలోని విద్యాం విధానంలో, సాంస్కృతిక వేదికలలో తీవ్రంగా జోక్యం చేసుకుంటున్నాయి. పాఠ్య పుస్తకాలలోని సిలబస్ ను మతం ప్రాతిపదికగా రూపొందిస్తున్నారు. డార్విన్ పరిణామక్రమ సిద్ధాంతాన్ని సిబిఎస్సీ సిలబస్ నుండి తొలగించడం, మను స్మృతిలోని పురుష సూక్తం ఆధారంగా జీవులు పుట్టారని నిర్ధారించడం వంటి చర్యలు అందులో భాగమే. మూక దాడుల పేరుతో దేశంలోని దళిత, గిరిజన, ఆదివాసీ, మహిళ, మైనార్టీ వెనుకబడిన తరగతుల ప్రజలపై దారుణంగా దాడులు చేస్తున్నాయి. ఈ ధోరణులు ప్రజస్వామ్య వ్యవస్థకు విరుద్ధమన్నారు.

**కార్పొరేట్స్ చేతుల్లోకి మన ఆర్థిక వ్యవస్థ :**

దేశ ఆర్థిక వ్యవస్థ మన చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం ఆధీనంలో ఉండాలని, అది సోషలిస్ట్ స్వరూపంతో ఉండాలని రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశించారు. కానీ ప్రస్తుతం మొత్తం ఆర్థికవ్యవస్థను కార్పొరేట్స్ చేతుల్లో పెడుతోంది. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తోంది. ఇప్పటికే 36 ప్రభుత్వరంగ సంస్థలలో వాటాలను అమ్మకాలకు పెట్టింది. గత 5 సం.లలో దేశంలోని కార్పొరేట్లు బ్యాంకుల దగ్గర తీసుకున్న 8 లక్షల 72వేల కోట్లను ప్రభుత్వం మాఫీ చేసింది. గత 10 సం.లలోనే దేశం అప్పు 156 లక్షల కోట్లకు చేరిందని ప్రభుత్వం ప్రకటించింది. దేశంలోని 80 కోట్ల శ్రామిక ప్రజలు సృష్టిస్తున్న సంపద, వారి చేతుల్లోకి కాకుండా కార్పొరేట్స్ చేతుల్లోకి పోతుందని అర్థమవుతుందన్నారు.

**ప్రత్యామ్నాయ పౌర సమూహం (సిఎఎ) -ఉద్దేశ్యాలు, లక్ష్యాలు**

దేశ లౌకిక విధానాన్ని కాపాడుకోవడం మత సామరస్యం, ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం పనిచేయడం. భావ ప్రకటనా స్వేచ్ఛ, భిన్నత్వ సాంస్కృతిక జీవన విధానాన్ని ప్రోత్సహించటం వంటి ఉద్దేశ్యాలు, లక్ష్యాలతో ప్రత్యామ్నాయ పౌర సమూహం (సిఎఎ) పని చేయాలనుకుంటోందన్నారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ పౌరసమూహం కొన్ని కీలక మైన విషయాలపై నిరసనలు, ఆందోళనలు నిర్వహించిందని డా.రవీంద్రనాథ్ తెలిపారు. ముఖ్యంగా గాంధీ వర్ధంతి రోజున గాంధీని చంపిందెవరు..? భగత్ సింగ్ జయంతి రోజున భగత్ సింగ్ స్ఫూర్తిని రగిలించే క్రమంలో కొన్ని కార్యక్రమాలు, రాజ్యాంగ పరిరక్షణ, అంశంపై ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాల్‌రావుతో సదస్సు నిర్వహించామన్నారు. రాజ్యాంగ విధ్వంసం, మన కర్తవ్యాలు అనే అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్‌తో సదస్సు నిర్వహించినట్టు, మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఖమ్మంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తాజాగా నేడు పాలకుల ప్రజావ్యతిరేక పోకడల పట్ల ప్రజలకు చైతన్యం కలిగించేలా ఒక చైతన్య సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ జీవిత భాగస్వామి, మేధావి, రాజకీయ విశ్లేషకులు, క్రూకెడ్ టింబర్ ఆఫ్ న్యూ ఇండియా పుస్తక రచయిత పరకాల ప్రభాకర్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

